క్లుప్తంగా

సన్మానం



మంగపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవీందర్‌ను జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. నెల రోజుల క్రితం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేస్, ప్రధాన కార్యదర్శి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గగ్గూరి మహేష్, ఇంతియాజ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులను నియమించాలి



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం అధ్యాపకులను నియమించాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోర్స నర్సింహమూర్తి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పడిన కళాశాలలో అధ్యాపకులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలేజీలో అన్ని రకాల వసతులను సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, మడకం రవి, నారాయణ తదితరులు ఉన్నారు.

నేడు ఎస్‌ఎఫ్‌ఐ బంద్



ఏటూరునాగారం: ఫుడ్ పాయిజన్‌తో చనిపోయిన విద్యార్థుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరుతూ నేడు(శనివారం) ఎస్‌ఎఫ్‌ఐ తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యాదర్శి రవి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల నుంచి రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో చనిపోతున్న ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవితేజ, బట్ట స్వామి తదితరులు ఉన్నారు.

పరామర్శ



ఏటూరునాగారం: మండల పరిధిలోని చెన్నబోయిన పల్లికి చెందిన సూర్య ప్రకాశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, గౌస్‌పాషా, చేల వినయ్ కుమార్, చెన్నేశ్వరావు, సారయ్య, భరత్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి

వెంకటాపురం(కె): వేడినీటిలో పడి తీవ్ర గాయాల పాలైన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని శాంతి నగర్‌కు చెందిన బాలుడు దేవిప్రసాద్(2) ఈనెల 27న వేడినీటిలో పడి గాయాలు కావడంతో ఎంజీఎంలో చికిత్స నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని తాడ్వాయి గ్రామానికి చెందిన ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ వజ్జ లక్ష్మీనారాయణ(61) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. గుండెపోటుతో అస్వస్థతకు గురికావడంతో వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. మృతుడు లక్ష్మీనారాయణ మండలంలోని కాటాపూర్ సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. వచ్చేడాది మార్చిలో పదవి విరమణ పొందనున్నారు. ఆయన మృతితో ఫారెస్టు అధికారుల్లో, గ్రామంలో విషాదాఛాలు అలుముకున్నాయి. మృతుడికి భార్య లక్ష్మీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సెక్షన్ ఆఫీసర్ మృతిపై రేంజ్ అధికారి కోట సత్తయ్య, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● తహసీల్దార్ గిరిబాబు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ గిరిబాబు తెలిపారు. మండలంలోని మేడారంలోని ఇంగ్లీష్ మీడియం, ఊరట్టంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను తహసీల్దార్ గిరిబాబు శుక్రవారం తనిఖీ చేశారు. మేడారంలోని ఇంగ్లీష్ మీడియం పాఠశాలలోని నిత్యవసర సరుకులు, కురగాయాలను పరిశీలించారు. పాఠశాలలో నిల్వ చేసిన కూరగాయాలు నాణ్యతగా లేకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

ఆశ్రమ హాస్టల్ పరిశీలన

వాజేడు: మండల పరిధిలోని పేరూరు బాలుర ఆశ్రమ హాస్టల్‌ను ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు శుక్రవారం పరిశీలించారు. హాస్టల్‌లో ఉన్న కూరగాయలు, వంట షెడ్డు, వంట సామగ్రి, పరిసరాలను పరిశీలించారు. కాగా హాస్టల్‌కు ప్రహరీ కావాలని, ఆర్‌ఓఆర్ సిస్టం పని చేయడం లేదని, సోలార్ సిస్టం పని చేయక చన్నీల్లతోనే స్నానం చేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. వీటి అవసరాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు ఎంపీఓ వెల్లడించారు. టేకులగూడెం పాఠశాలలో పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో మరుగుదొడ్లను నీరు రావడం లేదని దానిని గ్రామ పంచాయతీ పరిధిలో మరమ్మతులు చేయించనున్నట్లు తెలిపారు.



ఎస్‌ఎస్ తాడ్వాయి: కూరగాయలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గిరిబాబు



వాజేడు: పేరూరు ఆశ్రమ పాఠశాలలో కూరగాయలను పరిశీలిస్తున్న ఎంపీఓ

భోజన కార్మికులకు శిక్షణ

మంగపేట: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ మేనక ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులతో పాటు ప్రభుత్వ గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లోని మధ్యాహన్న భోజన కార్మికులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీఓ భద్రు మాట్లాడుతూ.. విద్యార్థులకు వంట చేసి వడ్డించడంలో పాటించాల్సిన పద్ధతులు, ప్రభుత్వ నిబంధనలను వివరించారు. మెనూ ప్రకారంగా రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. వంట చేసే వారు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, వంట పాత్రలను శుభ్రంగా కడుగాలని తాజా కురగాయలను మాత్రమే వంటకు వినియోగించాలన్నారు. నాణ్యమైన సరుకులను వాడాలని తెలిపారు. కార్యక్రమంలో మంగపేట కేజీబీవీ స్పెషలాఫీసర్ భాగ్యలక్ష్మి, రాజుపేట స్కూల్ కాంప్లెక్ హెచ్‌ఎం బానోతు బాలాజీ, కమలాపురం హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ భద్రు

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాజేడు: బ్యాగులు సోదా చేస్తున్న పోలీసులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి 163 వద్ద శుక్రవారం ఎస్సై తాజొద్దీన్ వాహనాలను తనిఖీ చేవారు. వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీంచారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు. నిబంధనలకు లోబడి వాహనాలు నడపకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

వాజేడు: మండల పరిధిలోని దూలాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు తనిఖీలను నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసి వాహనాల్లో తరలిస్తున్న వస్తువులను సోదాలు చేశారు.



ఏటూరునాగారం: తనిఖీ చేస్తున్న పోలీసులు



వాజేడు: వ్యాపారస్తుడి బ్యాగులను చూస్తున్న పోలీసులు

రామప్ప అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి

● బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగేశ్వర్‌రావు

వెంకటాపురం(ఎం): యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆకుల నాగేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రామప్ప టూరిజం సర్క్యూట్ కోసం కేంద్రం రూ.73.74 కోట్ల నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. రామప్ప ఆలయ అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ విజ్ఞప్తి మేరకు కేంద్రం నిధుల విడుదల చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో మంజూరు చేసిన నిధులతోనే రామప్పలో ప్రశాద్ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రపంచం ఆకర్షించే విధంగా టూరిజం అభివృద్ధి కోసం కేంద్రం కృషి చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ హయంలోనే చారిత్రాక, సాంస్కృతిక, వారసత్వ సంపదకు సరైన గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు

● బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నాగరాజు

ములుగు రూరల్: రాష్ట్రంలో గురుకుల పాఠశాల విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురవుతున్న విషయంపై బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాకు హాజరు కాకుండా బీజేవైఎం, బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సరికాదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ములుగు పోలీస్‌లు బీజేవైఎం నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత ఆహారం తిని విద్యార్థులు మృతి చెందినా... ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థుల మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకుండా పరిపాలన కొనసాగించడం కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. అరెస్టు అయిన వారిలో గాదం కుమార్, ప్రశాంత, భాను, శ్రీకాంతచారి, మణికంఠ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట బీజేవైఎం నాయకులు

అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



సౌండ్ బాక్స్‌లను అందజేస్తున్న ఉపాధ్యాయులు

● ఇన్‌చార్జ్ ఎంఈఓ కేశవరావు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ రేగ కేశవరావు అన్నారు. మండలంలోని కాటాపూర్ జెడ్పీ పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయుల సహకారంతో రూ.35వేల సౌండ్ సిస్టం బాక్స్‌లను వితరణ చేశారు. ఈసందర్భంగా కేశవరావు మాట్లాడుతూ.. పాఠశాలకు ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో సహకరించడం మంచి విషయం అన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బాణాల సుధాకర్ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సక్రు నాయక్ ,అక్బర్ బాషా, జీవన్ లాల్ ,కోడూరు సమ్మయ్య ,సామ్సన్, వెంకటేష్, పాపారావు, విజయ, రాజేష్ ,జయపాల్, మోహన్, శ్రీదేవి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ: పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అమలు చేసి తీరుతామని తెలిపారు. పదేళ్ల పరిపాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదని విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18 కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. తాము ప్రజాసేవకులమని, నియోజకవర్గ కష్టాలు తీర్చేందుకు రోజుకు 18 గంటలు పని చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్ గ్రామాలలో ఇటీవల నిర్మించిన సైడ్ కాల్వలను ప్రారంభించారు. అలాగే జగ్గయ్యపేటలో అంగన్‌వాడీ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పీఆర్ డీఈ రవికుమార్, జిల్లా, మండల నాయకులు ఉమేష్‌గౌడ్, పున్నం రవి, ఓం ప్రకాశ్, భిక్షపతి, శ్రీధర్‌గౌడ్, రాజేశ్వరరావు, నడిపెల్లి సంజీవరావు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

గుడుంబా స్వాధీనం

టేకుమట్లు: మండలంలోని గర్మిళ్లపల్లి ప్రధాన కూడలి వద్ద శుక్రవారం గుడుంబాను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్ల ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. చిట్యాల మండలంలోని అందుకుతండా గ్రామానికి చెందిన ఆజ్మీర సమ్మ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 20లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా గర్మిళ్లపల్లిలో పట్టుకున్నట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు తరలిచి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసి అబ్కారి శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఏఎస్సై దాట్ల కుమారస్వామి, కానిస్టేబుల్ వెంకటేష్, తదితరులు ఉన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



గోవిందరావుపేట: రైతు పండుగ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది



వాజేడు: మాట్లాడుతున్న అంజయ్య



మంగపేట: మాట్లాడుతున్న చైర్మన్ రమేశ్

● పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి

గోవిందరావుపేట: రైతుల ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సొసైటీ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో రైతు పండుగ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని అన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు సన్న రకం ధాన్యానికి రూ.500 రూపాయల బోనస్ రైతుల అకౌంట్ లలో జమ చేసున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ తిరుపతయ్య, క్లర్క్ వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు అండగా ప్రభుత్వం

వాజేడు: సాగు చేసుకునే రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని వాజేడు సొసైటీ అధ్యక్షుడు యగ్గడి అంజయ్య అన్నారు. ప్రజా ప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.18 వేల కోట్ల రైతుల రుణాలను మాఫీ చేసిందని మిగతా రైతులకు సంబంధించిన రుణాలను సైతం డిసెంబర్ 9 లోగా పూర్తి చేస్తుందని వెల్లడించారు. సక్రాంతి పండగ వరకు రైతు భరోసాను ప్రభుత్వం ఇచ్చేలా ముందుకు సాగుతుందని తెలిపారు. సొసైటీ ఉపాధ్యక్షుడు వత్స వాయి జగన్నాథరాజు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్ల పూడి విక్రాంత్, సొసైటీ సెక్రెటరీ సత్యనారాయణ, ఏఈఓ జాఫర్, ఎల్లయ్య ఉన్నారు.

మంగపేట: మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం(ఎఫ్ఎస్‌సీఎస్) కార్యాలయంలో చైర్మన్ తోట రమేశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రైతు పండుగ, రైతే రాజు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. రైతు సహకార సంఘాల ద్వారా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు, ఎరువుల విక్రయాలు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సీఈఓ జగన్నాథరావు, స్థానిక రైతులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'జగదీశ్ పేరు పెట్టాలి'

ఏటూరునాగారం: జిల్లాలో కొత్తగా ఏర్పడిన మల్లంపల్లి మండలానికి దివంగత జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ పేరును పెట్టాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొండాయి చిన్ని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మల్లంపల్లి మండలం కోసం జగదీశ్ ఎంతో కృషి చేశారని తెలిపారు.

పరీక్షలతో పోటీతత్వం



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

కాటారం: ప్రతిభా పరీక్షలతో విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందుతుందని మండల విద్యాధికారి శ్రీదేవి, టీఎంఎఫ్ మండల అధ్యక్షుడు గంట రాజబాబు అన్నారు. తెలంగాణ మాథమాటిక్స్ ఫోరం (టీఎమ్ఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి, వేగం, ఖచ్చితత్వం పెంచడానికి పోటీ పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. పదవ తరగతి విద్యార్థులు గణితంలోని అన్ని పాఠ్యాంశాలలో పూర్తి అవగాహన పెంచుకొని భవిష్యత్‌లో నిర్వహించే అన్ని ప్రవేశ పరీక్షలల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. జెడ్పీహెచ్‌ఎస్ విభాగం నుంచి కాటారం పాఠశాలకు చెందిన సునీల్ ప్రథమ స్థానం, ధన్వాడ పాఠశాలకు చెందిన రోహిత్ ద్వితీయ స్థానం, చింతకానికి చెందిన విష్ణు తృతీయ స్థానం, గురుకుల విభాగంలో కాటారం బాలుర పాఠశాలకు చెందిన మనిదీప్ ప్రథమ స్థానం, మహేందర్ తృతీయ స్థానం, కాటారం బాలికల పాఠశాలకు చెందిన మేఘన ద్వితీయ స్థానంలో విజేతలుగా నిలవగా బహుమతులు అందజేశారు. టీఎంఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సమ్మయ్య ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ములుగు రూరల్ : ఏటూరునాగారంలో డిసెంబర్ 06,07న నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఎండీ.గఫూర్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారం మోపుతూ కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పోతినేని సుదర్శన్ హాజరవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గుండబోయిన రవిగౌడ్, కొర్ర రాజు, ప్రవీణ్, సద్దాహుస్సేన్, దేవేందర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గఫూర్

ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు

ఏటూరునాగారం: మండలంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు సఫిగా జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నబోయినపెల్లి గ్రామంలోని రైతు కల్లాలను, కొనుగోలు సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తరుగు పేరుతో, కటింగ్‌లతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో రైతులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు కలిగినా అధికారులకు లేదా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ.గౌస్‌పాషా, మాజీ సర్పంచ్ చేల వినయ్ కుమార్, మండల సోషల్ మీడియా కోర్డినేటర్ సోదారి హరీష్, జనగాం చెన్నేశ్వరరావు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి మార్చురీలో వ్యక్తి మృతదేహం

ములుగు రూరల్: జిల్లా ఆస్పత్రి మార్చురీలో వ్యక్తి మృతదేహం ఉన్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లి నుంచి నల్లబెల్లి మండలం రేలకుంట వెళ్లే దారిలో మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదం జరిగినట్లు సమాచారం. కాగా, వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొంది మృతి చెందినట్లు తెలుస్తుంది. మృతదేహం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి మార్చురీలోని ఫ్రీజర్ బాక్స్‌లో ఉంది. ఈ విషయంపై ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులను సమాచారం కోరగా తమకు ఏమి తెలియదని సమాధానం ఇచ్చారు. పోలీసులను సమాచారం అందించగా రోడ్డు ప్రమాదంలో గాయపడి వ్యక్తి మృతి చెందిన విషయం వాస్తవమేనని కాని మృతి చెందిన వ్యక్తి వివరాలు తమ దగ్గర లేవని చెప్పడం గమనార్హం. రోడ్డు ప్రమాదం జరిగిన తీరు, వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.